



ఆరోగ్యానికి రక్తకణాలు కీలకం



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఆరోగ్యాన్ని కాపాడటంలో ప్లాస్మా, ఎర్ర, తెల్ల రక్తకణాలు, ప్లేట్‌లెట్స్ కీలకమని చెన్నయ్ అపోలో ఆస్పత్రి ప్రముఖ రక్త సంబంధిత వైద్య నిపుణులు డాక్టర్ పి.ప్రభు అన్నారు. శనివారం తిరుపతి అపోలో క్లినిక్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎర్రరక్త కణాలు ఊపిరితిత్తుల నుంచి శరీర కణజాలాలకు ఆక్సిజన్‌ను తీసుకెళతాయన్నారు. కార్బన్‌డయాక్సైడ్‌ను తిరిగి ఊపిరితిత్తులకు పంపుతాయన్నారు. ఈ ప్రక్రియలో ఎర్ర రక్తకణాలు కీలకమన్నారురర. తెల్ల రక్తకణాలు శరీరానికి రక్షణగా, అంటువ్యాధుల నుంచి రక్షిస్తాయన్నారు. రోగ నిరోధక శక్తిని కలిగి ఉంటాయన్నారు. ప్లేట్‌లెట్స్ రక్తం గడ్డ కట్టడానికి అవసరమన్నారు. చెన్నయ్ అపోలో ఆస్పత్రిలో రక్త సమస్య ఉన్నవారికి అవగాహన కల్పించి, చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు.

'ఘాట్' ఘనత 'విశ్వేశ్వరయ్య'దే..!




ప్రజాశక్తి-తిరుపతి సిటి

దట్టమైన అడవులు, ఎత్తైన గుట్టలు, భారీ చెట్లు, లోయలు తిరుమల శ్రీవారి చెంతకు రోడ్డు వేయడమంటే ఆషామాషీ కాదు. కష్టతరమైన ఈ పనిని చేసి చూపించారు ప్రముఖ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య. ఘాట్ రోడ్లంటే సాదా సీదా రోడ్లు కావు. ఎన్నో మలుపులు. శేషాచలం అడవుల్లో నుంచి వేసిన రోడ్లు ఇవి. 1944, ఏప్రిల్ 10న ఆనాటి ప్రముఖ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఈ ఘాట్ రోడ్డును వేశారు. మొదటగా ఘాట్ రోడ్డును అప్పటి మద్రాస్ గవర్నర్ ఆర్తూర్ హెూప్ ప్రారంభించారు. మొదట్లో ఘాట్‌రోడ్డులో చిన్నపాటి బస్సులు వెళ్లేవి. అప్పటి నుంచి ఇప్పటి వరకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య వేసిన రోడ్లపైనే వాహనాలు వెళుతున్నాయి. రోడ్లు వాడుతున్నారే గానీ, వేరే రోడ్లు మాత్రం వేయలేదంటే ఆయన నైపుణ్యాన్ని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఎంతో ప్రమాదకరమైన మలుపుల రోడ్లను వేయడమంటే సాదా సీదా విషయం కాదు. అప్పట్లోనే ఘాట్ రోడ్డు వేయడానికి ఏడాదికిపైగా సమయం పట్టిందంటే ఎంతకష్టమో ఇట్టే అర్థమైపోతుంది. అయితే ప్రస్తుతం తితిదే ఇంజనీరింగ్ అధికారులు తారు రోడ్డు మీద తారు రోడ్లు వేస్తూనే ఉన్నారు. తిరుమల ఘాట్ రోడ్డు వేసి 80 వసంతాలు పూర్తి కావడంతో తితిదే ఇంజనీరింగ్ విభాగం సంబరాలు చేసుకుంటోంది. తిరుపతి నుంచి తిరుమలకు ఘాట్ రోడ్డులో వెళ్ళాలంటే కనీసం 30 నిమిషాలకుపైగా సమయం పడుతుంది. అదే తిరుమల నుంచి తిరుపతికి రావాలంటే 45 నిమిషాల సమయం తప్పనిసరి. సెప్టెంబరు 15 మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని ఇంజనీర్స్ డేని జరుపుకుంటూ ఆయనకు ఘన నివాళి అర్పిస్తున్నారు.


నేడు ఇంజినీర్స్ డే

ఇంజనీర్లకు ఆయన ఆదర్శం : టివి సత్యనారాయణ, చీఫ్ ఇంజినీర్, టిటిడి




సాంకేతికపరంగా పెద్దగా పరికరాలు అందుబాటులో లేని కాలంలోనే ఆనకట్టలు, సముద్రపు కోతకు గురికుండా నగరాల నిర్మాణాలు, నీటి కాల్వలు, క్రషర్ గేట్లు ఏర్పాటు చేయడంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చూపిన ప్రతిభ అమోఘం. ఆయన అప్పటికి, ఇప్పటికి, ఎప్పటికి ఇంజనీర్లకు ఆదర్శప్రాయుడే. ఆయన వేసిన తిరుమల ఘాట్‌రోడ్లకు ప్రస్తుతం పర్యవేక్షణ బాధ్యత వహించడం సంతోషకరం.

ఎప్పటికీ వన్నె తరగవు : పి.జగదీశ్వర్‌రెడ్డి, ఎస్ఇ-3, టిటిడి



ప్రముఖ ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య సాహసోపేతంగా నిర్మించిన తిరుమల ఘాట్ రోడ్లు ఎప్పటికి వన్నె తగ్గువు. భారీ వర్షాలు వచ్చినప్పుడుకొంత మరమతుకు గురవుతాయే గాని, ఆయన చేపట్టిన నిర్మాణం ఎప్పటికీ చెక్కు చెదరదు. వర్షాల సమయంలో మరమ్మతులు చేసేటప్పుడు మేము ఆయన్నే గుర్తు చేసుకుంటాం. ఆయన సేవలు మాకు ఎపుడూ ఆదర్శనీయమే. తిరుమల ఘాట్‌రోడ్లను ప్రమాదరహితంగా నిలిపేందుకు ఇంజనీర్ల విభాగం నిరంతరం కృషి చేస్తుంది.

ఆయనే మాకు స్ఫూర్తి : కె.మల్లికార్జున ప్రసాద్, ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, టిటిడి



ఇంజనీర్లకు దిక్సూచిగా నిలిచిన మోక్షగుండం విశ్వేశరయ్యే మాకు స్ఫూర్తి. సవాళ్లను స్వీకరించడంలో ఆయనకు ఆయనే సాటి. కష్టకాలంలో సైతం ఆయన మేథోశక్తి అమోఘం. ఆయన సేవలను స్ఫూర్తిగా తీసుకుని మహిళలు సైతం ఈ వృత్తిలో రాణిస్తున్నారంటే అతిశయోక్తి కాదు.

ఆయన్ని చూసే ఇంజనీర్ అయ్యా : వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ ఇంజనీర్, ఎలక్ట్రికల్, టిటిడి



నేను చదువుకునే సమయంలోనే..మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవిత చరిత్రను చదివాను. మాది గ్రామీణ ప్రాంతం. నీటిపారుదల రంగంలో ఆయన చేసిన సేవలు వెలకట్టలేనివి. ఆయన్ని ఆదర్శంగా తీసుకునే ఇంజనీరింగ్ రంగంలోకి ప్రవేశించాను. యువ ఇంజనీర్లు ఆయన నైపుణ్యాన్ని అందిపుచ్చుకుని దేశాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలి.

కలకాలం గుర్తుంటాయి : పిఎస్ రత్నారెడ్డి, డబ్ల్యుఆర్‌డి ఇఇ, గూడూరు



మోక్షగుండం విశ్వేశ్వరయ్య అంటే ఇంజనీర్లకు ఓ మార్గదర్శి. బ్రిటీష్ కాలంలోనే ఆయన చేసిన నిర్మాణాలు ఇతరులకు ఆదర్శం. మైసూరు వద్దనున్న కృష్ణరాజుసాగర్ నిర్మాణం అప్పట్లోనే ఆసియాలో గొప్పకట్టడంగా పేరు గడించింది. కలకాలం గుర్తుండే పనులు చేయడమే ఇంజనీర్ల పండితుడైన విశ్వేశ్వరయ్యకు ఘనమైన నివాళి.

నిజాయతీ, నిబద్ధతకు మారుపేరు : కె.శివరామకృష్ణ, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్, టిటిడి



సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని ఇంజనీర్స్ డేగా జరుపుకుంటున్న సందర్భంగా వారి నిజాయతీ, నిబద్ధతను నేటి ఇంజనీర్లు గుర్తించుకోవాలి. వృత్తి పట్ల వారి ఇచ్చిన సందేశాన్ని, దేశ నిర్మాణంలో ఆయన అద్భుతమైన కృషిని, ఉన్నత ప్రమాణాలను స్మరించుకుంటాం. ఆయన జీవితం భారతీయ ఇంజనీర్లకు ఎప్పటికి స్ఫూర్తిదాయకమే.

వినాయక సాగర్‌లో... వ్యాయామానికి 'తుప్పు'

- ఏడాది కాకుండానే మరమ్మతులు
- నాశిరకం పరికరాలని ఆరోపణలు



పాడైపోయిన పరికరాలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి స్మార్ట్‌సిటీ పథకంలో భాగంగా వినాయకసాగర్‌ను రూ.20 కోట్లకు పైగా నిధులు వెచ్చించి ఎట్టకేలకు పూర్తి చేశారు. అయితే నిర్మాణ పనులు, వ్యాయామ పరికరాలు నాశిరకంగా కొనుగోలు చేయడం వల్ల ప్రారంభించి ఏడాది కాకుండానే పరికరాలు 'తుప్పు' పట్టాయి. వినాయకసాగర్‌కు ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకూ 'వాకింగ్' చేసేవారు, వ్యాయామం చేసేవారు దాదాపు వెయ్యి మందిపైనే పిల్లలు, పెద్దలు, యువకులు వచ్చి పోతుంటారు. అయితే ప్రారంభించిన ఏడాదికే వ్యాయామ పరికరాలు విరిగిపోవడం, పురుషుల జిమ్ మూతబడటం కాంట్రాక్టర్ నిర్మాణ పనుల్లో చూపెట్టిన 'డొల్ల'తనం కనిపిస్తోంది. ఇటీవల వినాయకసాగర్ వద్దకు కమిషనర్ విచ్చేసిన సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ నాయకులు కలిసి వ్యాయామ పరికరాలు విరిగిపోయి తుప్పుపట్టాయని సమస్యను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే మరమ్మతులు చేయిస్తామని చెప్పినా, ఇంతవరకూ పట్టించుకోకపోవడం వ్యాయామం చేసేవారికి 'నీరసం' తెప్పిస్తోంది. పది రోజుల క్రితం తిరుపతి ఎంఎల్ఎ వినాయక సాగర్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్నారు. ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లినా వినియోగంలోకి తీసుకురాలేదన్నది 'వాకర్స్' ఆవేదన.

రెండు వారాల క్రితం కమిషనర్ ఎన్.మౌర్య వినాయకసాగర్‌ను సందర్శించి, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. వినాయకసాగర్‌లో ఉండే ఆట వస్తువులు, వ్యాయామ పరికరాలు మరమ్మతుకు గురై కిందపడిపోయి ఉన్నాయని, మున్సిపల్ అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయకుండా అలా వదిలేయడం దారుణమని వాకర్స్ అసోసియేషన్ నేతలు ఆరోపిస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలు పది రోజులకు ఒకసారి మరమ్మతవుతున్నాయి. నాశిరకం వస్తువులు కొనుగోలు చేయడం వల్లనే అలా ఉన్నాయని వాకర్స్ అరోపిస్తున్నారు. వ్యాయామం చేసుకునే సైకిలింగ్, ఇతర వస్తువులు పనికిరాకుండా ఉన్నాయి. వినాయకసాగర్‌లోని జిమ్‌లో ఉండే పరికరాలు నాశిరకంగా ఉండటమే కాకుండా, 20 రోజులుగా తాళాలు వేసి ఉండటం గమనార్హం. వ్యాయామం చేసుకునేందుకు చిన్నపిల్లలకు, మహిళలకు ప్రత్యేక విభాగాలు ఉన్నాయి. పురుషులకు వేరేచోట జిమ్ ఉంది. పురుషుల జిమ్ పరికరాలు మరమ్మతుకు గురై మూలబడి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉన్నాయి. కొన్ని పరికరాలు తుప్పు పట్టాయి.



మూతబడిన పురుషుల జిమ్

ఈ 'లీల'కు 'మూలం' ఏది..?

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఎంఎల్ఏ స్థాయి వ్యక్తి ఓ మహిళతో సాగించిన రాసలీలలు ఇటీవల రాష్ట్రంలో దూమరాన్ని రేపాయి. జిల్లాకు చెందిన శాసనసభ్యుడు తన కోర్కె తీర్చాలంటూ బలవంతంగా లైంగిక దాడికి దిగిన వీడియో క్లిప్పింగ్‌లతో సహా నెట్టింట్‌లో హల్‌చల్ చేశాయి. ఆఖరికి ఆయన్ను పార్టీ సస్పెండ్ చేసింది. ప్రత్యర్థులు ఉద్దేశపూర్వకంగానే తనను ఇరికించారని బాధితుడు ఆక్షేపిస్తున్నా ఈ రాసలీల వెనుక దాగి ఉన్న మూలాలు ఇప్పటికి జిల్లాలో రహస్యంగానే ఉండటం గమనార్హం.

గౌరవప్రదమైన పదవిలో ఉన్న శాసనసభ్యులు ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, లైంగిక దాడికి పాల్పడి పార్టీ నుంచి సస్పెండైన ఘటన జిల్లా చరిత్రలో ఇటీవల చోటు చేసుకుంది. తిరుపతి జిల్లాలోని ఎస్‌సి రిజర్వుడు నియోజకవర్గమైన సత్యవేడు నుంచి 2024 ఎన్నికల్లో ఎంఎల్‌ఏగా గెలుపొందిన ఆదిమూలం, గతంలో 2019లో వైసిపి తరుపున ఎంఎల్‌ఏగా గెలిచారు. ఓ దశలో మంత్రి పదవికి సైతం పోటీలో నిలిచారు. కానీ ఇటీవల కాలంలో ఈ నెల 5వ తేదీన నియోజకవర్గంలో టిడిపికి చెందిన వరలక్ష్మీ అనే ఓ మహిళ హైదరాబాదు వేదికగా ఎంఎల్‌ఏ ఆదిమూలం తనను లైంగికంగా హింసించాడని, తన కోర్కె తీర్చకపోతే, భర్త, పిల్లల్ని చంపేస్తాడని బెదిరించారని, తిరుపతిలోని ఓ హోటల్‌లో ఆయన తనను బెదిరించి లైంగికంగా దాడి చేశాడని ఆరోపించింది. ఇది ఒక్కసారిగా సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. టిడిపికి అనుకూలమైన ఓ ఛానల్‌లో సైతం వైరల్ కావడంతో తెలుగుదేశం పార్టీ స్పందించి వెనువెంటనే ఆయన్ని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ అదే రోజు ఆదేశాలు జారీ చేసింది. పోలీసులు సైతం కేసు నమోదు చేసి ముందుకెళ్లారు. ఈ మేరకు రెండు రోజుల క్రితం తిరుపతి ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలలో సైతం ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కేసు ప్రస్తుతం విచారణ జరుగుతోంది. మరో పక్క తనంటే గిట్టని వారు, ప్రత్యర్థులు ఆమెకు డబ్బు ఆశ చూపి, తనపై లేనిపోని అభూతకల్పనలు సృష్టిస్తున్నారని, తను ఎవ్వరికి ఎలాంటి హానీ చేయలేదని ఎంఎల్‌ఏ వెల్లడిస్తున్నారు. వాస్తవానికి నియోజకవర్గంలో వైసిపి ఎంఎల్‌ఏగా ఉంటూ ఎన్నికల ముందు టిడిపి తీర్థం తీసుకుని, బరిలో నిలిచిన ఆదిమూలానికి నియోజకవర్గ టిడిపి నాయకత్వం మద్దతు నిరాకరించింది. ఎన్నికలకు రెండు రోజుల ముందు కూడా ఆయన వద్దని అధినేతకు సూచించారు. ఎట్టికేలకు ఎన్నిక్రల్లో ఆయన గెలుపొందారు. వైసిపి నాయకులే తనపై కక్షకట్టి ఇలా చేశారన్నది ఆ ఎంఎల్ఏ వాదన. వారికి టిడిపిలోని ప్రత్యర్థి వర్గం సహకరించిందని ఆయన అనుచరులు ఆరోపిస్తున్నారు. దీంతో దళిత సంఘాలు ఎంఎల్‌ఏకి మద్దతుగా నియోజకవర్గంలో నిరసనలు చేపట్టింది. ఎంఎల్‌ఏ దళితుడు కావడంతోనే ఇలా పెత్తందారులు ఆయన్ని అణగదొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శిస్తున్నారు. అయితే ఓ మహిళ తానే ప్రాణానికంటే మిన్నగా చూసుకునే శీలంపై స్వయంగా అభాండాలు వేసుకునే ఛాన్స్ లేదని, ఇందులో కొంతైనా వాస్తవం ఉంటుందని జిల్లా వాసుల మనోగతం. ఏది ఏమైనా మహిళల పట్ల నీచంగా వ్యవహరించే వారికి కఠిన శిక్షలు తప్పనిసరి. ఆదిమూలం రాసలీలల వెనుక ఏ మూలం దాగి ఉందో విచారణలో వెల్లడి కానుంది.

సిఐటియు చంద్రగిరి మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి)





సిఐటియు చంద్రగిరి మండల కమిటీ శనివారం ఎంపికయ్యింది. కన్వీనర్‌గా యుగంధర్, కోకన్వీనర్‌గా వాణిశ్రీతో పాటు, సభ్యులుగా నాగభూషణమ్మ, కృష్ణమ్మ, సుహాసిని, నవనీత, మునిరాజమ్మ, చిట్టిబాబు, ప్రకాష్, నరసింహ, సోమశ్రీధర్, వేదవతి ఉన్నారు. స్కీం వర్కర్ల సమస్యలపై, కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వకపోవడంపై ఆందోళనలు చేస్తామని నూతన కమిటీ వెల్లడించింది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వాణిశ్రీ, జిల్లా ఉపాధ్యక్షులు గండికోట నాగ వెంకటేష్, ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గండికోట చిన్నబాబు హాజరయ్యారు.

ఏచూరికి వ్యవసాయ కూలీల నివాళి

ప్రజాశక్తి - నాగలాపురం, యంత్రాంగం

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి వ్యవసాయ కూలీలు నివాళి అర్పించారు. నాగలాపురంలో సిపిఎం నాయకులు మురగేష్ ఆధ్వర్యంలో సంతాప సభ జరిగింది. దేశం గొప్ప యోధుడిని కోల్పోయిందన్నారు. ఏచూరి జీవితాన్ని పార్టీకి అంకితం చేయడమే గాకుండా, తన పార్థివదేహాన్ని ప్రజలకు ఉపయోగపడాలని ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రికి రాసివ్వడం ఆయన గొప్పతనమన్నారు. ఈ సంతాపసభలో నాయకులు దినమణి, సుబ్బమ్మ, బాలాజీ, అముద పాల్గొన్నారు.

బాలాయపల్లి మండల కేంద్రంలో సుబ్రహ్మణ్యం గ్రామానికి వెళ్లే కూడలిలో సంతాపసభ జరిగింది. వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వడ్డేపల్లి చెంగయ్య, బాలాయపల్లి నాయకులు గజ్జల రాజగోపాల్ నివాళి అర్పించారు. మతోన్మాదులు కార్పొరేట్లు పొత్తు కట్టి ప్రజల మీద పడుతుంటే, ప్రజల్ని ఎర్రజెండా నీడకు తెచ్చి రానివ్వండి చూసుకుందాం అని ధైర్యం చెప్పిన కాకలు తీరిన కమ్యూనిస్టు యోధుడు అని అన్నారు. కెవిబిపురంలో.. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్ ఆధ్వర్యంలో కస్తూరిపురం, కొత్తూరు గ్రామాల్లో నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు, శాఖ కార్యదర్శి వరలక్ష్మి, ధావాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు



వ్యవసాయ కూలీల నివాళి

మానవీయ విలువల ప్రేరేపణ 'నిర్వాణ'



పుస్తకావిష్కరణ సభలో వక్తలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి


బౌద్ధుని ధర్మాలు, మానవీయ విలువలకు అద్దం పట్టేలా 'నిర్వాణ' నవల ఉందని వక్తలు ఉద్ఘాటించారు. ప్రముఖ రచయిత డాక్టర్ బండి సత్యనారాయణ రచించిన 'నిర్వాణ' నవల పుస్తకావిష్కరణ శనివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. వేమన విజ్ఞాన కేంద్రం, దళిత సాహిత్య వికాస వేదిక సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక యశోద నగరంలోని వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగింది. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షులు పి అంజయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ బుద్దిస్ట్ బొర్రా గోవర్ధన్ మాట్లాడుతూ 'నిర్వాణ' అంటే పూర్తిగా 'ఆరిపోవడం' అని అర్థమని అన్నారు. కవి అనేవారు కాలంతో పాటు బతకాలి, క్రాంతి దర్శి కావాలని సూచించారు. సమాజానికి మానవత్వం అవసరం అని చెప్పిన మొదటి వ్యక్తి బుద్ధుడని, మానవుడు కోర్కెల వలయంలో చిక్కుకోకుండా మానవీయ విలువలు పెంపొందించుకోవాలన్నారు. బౌద్ధ ధర్మాన్ని వెల్లడించిన పుస్తకాలలో 'మహాబక్షి' నవల తర్వాత ఇది రెండవదని వెల్లడించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ బుద్ధుడు ఆనాటి సామాజిక పరిస్థితులను అవగాహన చేసుకుని, వాటి నుంచి ప్రజలు విముక్తి పొందేలా కషి చేశారన్నారు. బుద్ధుడి కాలం నుంచి పేదలు బడుగు బలహీన వర్గాలను ఉన్నత శిఖరాల్లో నిలిపి, సమ సమాజాన్ని నిర్మించాలన్న తపనతో పోరాటాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. బుద్ధుడి సిద్ధాంతాలను అర్థం చేసుకొని నేటి ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత నేటి సాహితీవేత్తలపై ఉందన్నారు. పి.అంజయ్య మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యానికి అక్షరం ఎంతో అవసరం అన్నారు. ఆకాశవాణి విశ్రాంతి సంచాలకులు మల్లేశ్వరరావు మాట్లాడుతూ బుద్ధుని కథను క్రమ పద్ధతిలో, ముఖ్యమైన ఘట్టాలను ఒక పుస్తక రూపంలో రచయిత నిర్వాణ ద్వారా తీసుకొచ్చారని తెలిపారు. రిటైర్డ్ జడ్జి గురప్ప మాట్లాడుతూ సమాజంలోని అసమానతల మీద, స్త్రీహక్కుల మీద, సామాజిక న్యాయం పట్ల ప్రపంచంలోనే మొట్టమొదటగా మాట్లాడిన వ్యక్తి బుద్ధుడని, కథాంశంతో రూపొందించిన ఈ నవల ఎందరినో ప్రేరేపిస్తుందన్నారు. టెంకాయల దామోదరం మాట్లాడుతూ చారిత్రాత్మక నవలను రాసేందుకు ముందుకు వచ్చిన రచయితను అభినందించారు. నవల అనేది కల్పితం అని, చరిత్ర అనేది వాస్తవం అని తెలిపారు. బుద్ధుడు గొప్ప హేతువాది అని, మానవీయ విలువలను ప్రేరేపిస్తూ రచించిన చక్కని గీతిక ఈ పుస్తకం అని కొనియాడారు. పుస్తక రచయిత బండి సత్యనారాయణ మాట్లాడుతూ బౌద్ధ మతం, బుద్ధుడి సిద్ధాంతాలు అందరికీ అర్థం కావాలనే ఉద్దేశంతోనే సరళమైన పద్ధతులు, పెద్దల సలహాలు సూచనల మేరకు ఈ పుస్తకాన్ని తీసుకొచ్చానన్నారు. దీన్ని చదివి ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగర్జున, చిన్నం కాలయ్య పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల తరువాతేనా 'బోర్డు'

టిటిడి ఛైర్మన్ పదవికి 12 మంది పోటీ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో


తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి లేనిదే బ్రహ్మోత్సవాలు జరగవు. ఒకవేళ జరపాలంటే రాష్ట్రంలో ముగ్గురు సీనియర్ ఐఎఎస్‌లతో స్పెసిఫైడ్ అథారిటీని నియమించి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరిస్తుంది. అలాంటిది ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలైనా కీలకమైన టిటిడి బోర్డును ఏర్పాటు చేయకపోవడం చూస్తుంటే ఛైర్మన్ పదవికి టిడిపి, జనసేన నుంచి డజన్ మందిపైగా పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం అన్న చందంగా రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితి తయారయ్యింది. అక్టోబర్ 3 నుంచి సాలికట్ల బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే టిటిడి పూర్తిస్థాయి బోర్డును ప్రకటించి, భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఏర్పాట్లు చేయాల్సి ఉంది. విజయవాడ వరదల పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కాలయాపన చేస్తున్నారని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నా, వాస్తవానికి ఎక్కువమంది పోటీ పడటం వల్లనే తేల్చలేకపోయారన్న చర్చ నడుస్తోంది. కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతి రాజు, నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సినీ నిర్మాత అశ్వనీదత్, సినీ నటుడు మురళీమోహన్, జనసేన నుంచి కొణిదెల నాగబాబు, టివి 5 ఎమ్‌డి బిఆర్ నాయుడు, తిరుపతి వాస్తవ్యుడు జనసేన జిల్లా ఇన్‌ఛార్జి పసుపులేటి హరిప్రసాద్ సైతం ఛైర్మన్ పదవి కోసం పట్టుబడుతున్నారు. అయితే బిజెపి, టిడిపి, జనసేన కూటమిలో అధికారం చేపట్టిన తరువాత నామినేటెడ్ పదవుల విషయంలో ఒప్పందం కుదిరింది. ఆగస్టులో నామినేటెడ్ పదవుల పందేరం ఉందని చర్చ నడిచినా, వరదల నేపథ్యంలో వాయిదా వేసినట్లు తెలుస్తోంది. అయితే అక్టోబర్‌లో జరగనున్న బ్రహ్మోత్సవాలు బోర్డు లేకుండానే, అధికారులతోనే జరిగే అవకాశం ఉంది.



'పెద్దిరెడ్డి'కి ప్రాధాన్యత ఏది..?

జగన్‌పై వైసిపి శ్రేణుల గుర్రు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



పార్టీ అధికారంలో ఉన్నపుడు, లేనపుడు ఏ ఉప ఎన్నిక జరిగినా 'పెద్దిరెడ్డి' ఆర్థికంగానూ, రాజకీయ బలంతోనూ పార్టీకి వెన్నుదన్నుగా ఉండేవారు. జిల్లాలో 'పెద్దాయన'గా గుర్తింపు పొందిన పెద్దిరెడ్డికి రాష్ట్రస్థాయిలో కీలక పదవి ఇవ్వకుండా కేవలం చిత్తూరు జిల్లాకే పరిమితం చేయడంపై ఆ పార్టీ శ్రేణులు అధినేత జగన్‌పై గుర్రు మంటున్నారు. మాజీ మంత్రి ఆర్‌కె రోజాకు రాష్ట్రస్థాయి కీలక పదవి ఇచ్చి, పెద్దిరెడ్డిని జిల్లాకే పరిమితం చేయడంపై చర్చ నడుస్తోంది.

ముఖ్యంగా చిత్తూరు జిల్లాలో చెవిరెడ్డి భాస్కరరెడ్డికి పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి కట్టబెట్టడం.. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్థాయి తగ్గించడం పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. అంటే ఇంతకాలం రాయలసీమ సీఎంలా వ్యవహరించిన పెద్దిరెడ్డిని జగన్ కావాలనే పక్కన పెడుతున్నారా? అన్న చర్చ మొదలైంది. రాయలసీమలో వైసీపీకి అంతో ఇంతో మర్యాద నిలిపిన జిల్లా అంటే ఉమ్మడి చిత్తూరు జిల్లా అని చెప్పవచ్చు. గత ఎన్నికల్లో ఇద్దరు ఎమ్మెల్యేలతో పాటు రెండు ఎంపీ స్థానాలు గెలిచిన జిల్లా చిత్తూరు ఒక్కటే.. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నుంచి నలుగురు ఎంపీలు గెలిస్తే అందులో ఇద్దరు ఈ జిల్లా నుంచే గెలిచారు. ఇక జిల్లా నుంచి గెలిచిన ఇద్దరు ఎమ్మెల్యేలు ఒక ఫ్యామిలీ వారే.. పుంగనూరు నుంచి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె నుంచి ఆయన సోదరుడు పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డిలు మెజార్టీలు గణనీయంగా తగ్గినా గట్టెక్క గలిగారు. రాజంపేట ఎంపీగా గెలిచిన మిధున్‌రెడ్డి కూడా పెద్దిరెడ్డి వారసుడే.

జగన్ అధికారంలో ఉన్న అయిదేళు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పెత్తనం ఒక రేంజ్లో నడిచింది. నగరిలో రోజా, చంద్రగిరిలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, తిరుపతిలో భూమన అభినయ్‌రెడ్డి, శ్రీకాళహస్తిలో బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఓడిపోవడానికి ప్రధాన కారణం 'పెద్దిరెడ్డి' రాజకీయ డ్రామా అని జగన్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలోనే పెద్దిరెడ్డికి ప్రాధాన్యత తగ్గించినట్లు చర్చ నడుస్తోంది. రోజాకు వ్యతిరేకరంగా పనిచేసిన నగరి మున్సిపల్ ఛైర్మన్ శాంతికుమార్ దంపతులను పార్టీనుంచి సస్పెండ్ చేయించడం చూస్తుంటే రోజాకు ఇచ్చిన ప్రాధాన్యత పెద్దిరెడ్డికి ఇవ్వలేదని ప్రస్ఫుటంగా అర్థమవుతుంది. అలాగే చిత్తూరులో విజయానందరెడ్డికి వ్యతిరేకంగా పనిచేసిన పెద్దిరెడ్డి అనుచరులు బుల్లెట్ సురేష్ అనుచరులను పార్టీనుంచి సస్పెండ్ చేయాలని అధినేతను కోరినట్లు సమాచారం. మరో వైపు పలమనేరు మాజీ ఎమెల్యే వెంకటేగౌడ తనకు కో ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ రెడ్డెమ్మ తో పాటు జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు ఎన్నికలలో సహకరించలేదని జగన్‌కు ఫిర్యాదు చేశారంట. అయితే వీరిలో రెడ్డెమ్మది పెద్దిరెడ్డి వర్గం కాగా శ్రీనివాసులు మాత్రం భారతి సిఫార్సుతో పదవి తెచ్చుకున్న వ్యక్తి. కుప్పంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా చంద్రబాబుకు సింపతీ ఇమేజ్ పెరగడానికి సెంథిల్ లాంటి వ్యక్తులు వ్యవహారించిన తీరు కారణమని చర్చించుకున్నారంట. మొత్తం మీదా ఓటమి పాలైనా పార్టీలో తమదే పైచేయి అని రోజా, చెవిరెడ్డిలు నిరూపించుకున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

'బాబు' వ్యూహానికి చెక్ పెట్టేందుకే..!

వైసిపి రాష్ట్ర కార్యవర్గంలోకి రోజా, భూమన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఉమ్మడి జిల్లాలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో టిడిపి అనూహ్యంగా విజయభేరి మోగించింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ చిత్తుచిత్తుగా ఓటమిని చవిచూసింది. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వైసిపి కంచుకోట. కాంగ్రెస్, వైసిపి హయాంలోనూ కొన్ని నియోజకవర్గాల్లో మూడు దశాబ్దాలుగా గెలుస్తూ వచ్చిన నియోజకవర్గాలు ఉన్నాయి. భారీ ఓటమి పాలు కావడంతో జగన్‌కు దిమ్మ తిరిగింది. తాజాగా ఉండవల్లి ప్యాలెస్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో పూర్వ వైభవం తెచ్చేందుకు వ్యూహం రచించారు. ఈ జిల్లాల్లో బాబు రాజకీయాలకు చెక్ పెట్టేందుకు ఫైర్‌బ్రాండ్ రోజాకు, మాటల చతురత చాటే భూమన కరుణాకర్‌రెడ్డికి రాష్ట్ర అధికార ప్రతినిధులుగా చోటు కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ముగ్గురికి అవకాశం ఇస్తే, అందులో ఇద్దరు చిత్తూరు నుంచి ఆర్‌కె రోజా, తిరుపతి జిల్లా నుంచి భూమన కరుణాకర్‌రెడ్డిలను ఈ పదవులు వరించాయి. అటు రోజా, ఇటు భూమన కరుణాకర్‌రెడ్డిలు ఈ పదవులు ఇవ్వడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికార ప్రభుత్వ పథకాలపైన, అవినీతి అక్రమాలపైన నిరంతరం అధ్యయనం చేస్తూ ఎప్పటికప్పుడు ప్రతిపక్షంలో మాటల బాణాలు విసరడమే వీరి పని. రాష్ట్రవ్యాప్తంగానూ రోజా, కరుణాకర్‌రెడ్డిలకు ప్రత్యేక స్థానం ఇచ్చేలా క్యాడర్‌కు హితోపదేశం చేసినట్లు తెలుస్తోంది. టిడిపి కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీల నుంచి, ప్రభుత్వం ఏర్పడిన తరువాత విస్మరించడంపైనా వివరాలను సేకరించి ప్రతిపక్ష హోదాలో వీరిద్దరూ ప్రచారం చేయనున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రాష్ట్ర కేంద్రంలో ఇద్దరికి చోటు కల్పించడం వైసిపి శ్రేణుల్లో ఆనందం నెలకొంది.

వరద బాధితులకు విరాళాలు సేకరణ


విరాళాలు సేకరిస్తున్న గాయత్రీ స్కూలు విద్యార్థులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విజయవాడ వరద బాధితుల సహాయార్థం గూడూరు పట్టణానికి చెందిన శ్రీ గాయత్రీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు శనివారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి మాట్లాడు తూ వరద బాధితుల సహాయం కోసం తమ పాఠశాల విద్యార్థులు విరాళాలు సేకరించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ చిన్నతనం నుండే సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని పేర్కొన్నారు. తాము సేకరించిన విరాళాలను సిఎం రిలీఫ్ ఫండ్ కు పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్ర శేఖర్, మునిరాజ, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : విజయవాడ వరద బాధితుల సహాయార్థం గూడూరు మాళవ్య నగర్‌కి చెందిన రిటైర్డ్ అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ మద్దూరు రామ్ ప్రసాద్ 25 వేల రూపాయల చెక్కును గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌కి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ వరద బాధితులకు సాయం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ , తిరుపతి పార్లమెంటు అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, మాజీ కౌన్సిలర్ తిరుపతి పార్లమెంటు క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు తాతపూడి ఇశ్రాయేల్ కుమార్, గూడూరు నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు, ఎండి అబ్దుల్ రహీమ్ పాల్గొన్నారు.

నాయుడుపేట: విజయవాడ వరద బాధితులకు నాయుడుపేట వ్యాపారులు తమ ఆర్థిక సహాయం అందించారు. నాయుడుపేట పాన్ బ్రోకర్స్ అండ్ బులియన్ మర్చంట్ అసోసియేషన్ వారు ఒక లక్ష యాభైవేల రూపాయలు నాయుడుపేట క్లాత్ మర్చంట్ అసోసియేషన్ వారు ఒక లక్ష రూపాయల చెక్కులను సూళ్లూరుపేట నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ ఏఎంసీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి లకు అందించారు. ఈ సందర్భంగా వారు నెలవల సుబ్రహ్మణ్యం విజయభాస్కర్ రెడ్డి లకు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సోమిశెట్టి వెంకటేశ్వర్లు,సముద్రాల రమేష్ బాబు,కోటూరు సాయిరాం ప్రసాద్,పలువురు బంగారం, వస్త్ర వ్యాపారులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌కు విరాళం


ఎమ్మెల్యేకు చెక్కును అందిస్తున్న మధునాయుడు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణంలోని స్థానిక బొల్లినేని జయరాం నాయుడు ఎనిమిదవ వర్ధంతి సందర్భం గా తండ్రి జ్ఞాపకార్థం అన్నా క్యాంటీన్‌కు తన వంతుగా 25వేల రూపాయల చెక్కును బొల్లినేని మధునాయుడు నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌కి శనివారం అందించారు. ఈ సందర్భంగా బొల్లినేని మధు నాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పేదవారి కడుపు నింపేందుకు ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ ఎంతో గొప్పదని అలాంటి వాటికి తమ సంపాదించిన సంపాదనలో కొంతవరకు సాయం అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మిగిలిన వారు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధునాయుడు కుటుంబ సభ్యులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

గణేష్ లడ్డూను దక్కించుకున్న శివకుమార్

ప్రజాశక్తి -కోట : కోట పట్టణంలోని సారంగం వీధిలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లడ్డూ వేలం పాటలో పాల్గొన్న కోటకు చెందిన సారంగం శివకుమార్ 51,500 రూపాయలకు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం స్వామి ఉత్సవాన్ని కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు తీగల సురేష్ బాబు, జనసేన యువ నాయకులు హరీష్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతి పోటీలలో కూడా పాల్గొని తమ వివిధ రకాల నైపుణ్యాలను వెలికి తీసి ప్రదర్శించి రాణించాలని వర్సిటీ లైబ్రేరియన్ ఆచార్య సురేంద్రబాబు, ఆకాశవాణి రేడియో సీనియర్ జర్నలిస్టు మల్లేశ్వరరావు పిలుపు నిచ్చారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం 70 సంవత్సరాల ప్రస్థానంలో 'హైయర్ ఎడ్యుకేషన్ ఫీల్డ్ విత్ పార్ ఎక్సెన్స్' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్, పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య వి రమేష్ బాబు, జి ఆర్ కే శర్మ, కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, వివిధ డిగ్రీ కళాశాల నుంచి దాదాపు 160 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించిన అచ్చుకట్ల వెంకటేశ్వర్లుకి మండల స్థాయిలో ఆత్మీయ సన్మాన సభను శనివారం నిర్వహించారు. నాగలాపురం వర్తక వ్యాపార కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల విద్యాశాఖ అధికారులు ఏ బాబయ్య, జనార్దన్ రాజు మాట్లాడుతూ వెంకటేశ్వర్లు 35 సంవత్సరాల సర్వీసులో విద్యా రంగానికి చేసిన సేవలను, ఎంఆర్‌పిలుగా విద్యారంగానికి చేసిన కృషిని మండల స్థాయిలో జరిగే ప్రతి కార్యక్రమంలో ముందుండి విజయవంతం చేయడంలో కీలక పాత్రను పోషించే వారని, విద్యాభివృద్ధికి కృషి చేసే వారిని కొనియాడారు. అనంతరం మండలంలోని ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లుని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు , ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆనంద్ గౌడ్‌ను పరామర్శించిన ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - క్యాంపస్ : ఇటీవల అనారోగ్యానికి గురై, శస్త్ర చేసుకుని తిరుపతిలోని పద్మావతి నగర్ లో వుంటూ విశ్రాంతి తీసుకుంటున్న తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద గౌడ్‌ని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి పరామర్శించారు. ఆరోగ్యాన్ని దృష్టిలో వుంచుకుని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శులు చప్పిడి మహేష్ నాయుడు, రెడ్డివారి గురవారెడ్డి, జయప్రకాష్, తెలుగు యువత నాయకులు, కె. రామ్మోహన్, అశోక్, రాజు, భద్ర యాదవ్ పాల్గొన్నారు.

గణపతి హోమంలో రిషితా రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని కైలాసగిరి కాలనీలో శనివారం నిర్వహించిన గణపతి హోమ పూజల్లో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి పాల్గొన్నారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. గణపతి హోమం పాలుపంచుకోవడం, పేదలకు అన్నదానం చేయడం ఆనందంగా ఉందని రిషితా రెడ్డి అన్నారు. టీడీపీ నేతలు డాక్టర్ నైనారు పొన్నారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కురుగొండ్లను కలిసిన గాలి బ్రదర్స్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, ఆ పార్టీ తొట్టంబేడు మండల అధ్యక్షులు గాలి మురళీనాయుడు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా బాలాయపల్లి మండలంలో గాలి బ్రదర్స్ కు పరిచయమున్న టీడీపీ కార్యకర్తల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నాయకులు కృష్ణయ్య, తిరుకాల హరి గౌడ్, గోపీ నాయుడు పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి రూరల్ మండలం లింగేశ్వర్ నగర్ లో వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని 8వ రోజు బిజి కృష్ణయాదవ్, ఆనంద్ యాదవ్ ఆధ్వర్యంలో వెయ్యి మంది భక్తులకు శనివారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి తెలుగు మహిళా నాయకురాలు పులివర్తి సుధారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రజలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వినాయక కమిటీ సభ్యులు బుజ్జమ్మ, కుట్టి, చందు, శరత్, భారత్, తేజా, ఉదయ్ పాల్గొన్నారు.

కియా గ్రావిటీ రేంజ్ కార్ ఆవిష్కరణ



కియా కారును ఆవిష్కరిస్తున్న షోరూమ్ అధినేత జగన్నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ప్రముఖ కార్ల సంస్థ కియా నూతనంగా రూపొందించిన కియో గ్రావిటి రేంజ్ కారును హాసి ఆటో కార్ల ప్రైవేట్ లిమిటెడ్ కియో షో రూమ్ అధినేత జగన్నాథ్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. స్థానిక బెంగళూరు చెన్నై బైపాస్ రోడ్ లోని ఆ షోరూం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా, వినియోగదారుల సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని అత్యాధునిక సౌకర్యాలతో ఈ వాహనాన్ని రూపొందించారన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 8688829739 ఫోన్ నెంబర్ ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెరుకు నిరంజన్, భారతీ రెడ్డి, హోషిమారెడ్డి, ఆ సంస్థ ప్రతినిధులు, వినియోగదారులు పాల్గొన్నారు.

రైల్వేగేటు మూడు రోజులు మూసివేత

వాహనదారులకు రైల్వే అధికారుల సూచన



తాత్కాలికంగా మూసి వేసిన రైల్వే గేటు

ప్రజాశక్తి-వెంకటగిరి: వెంకటగిరి–నాయుడుపేట ప్రధాన రైల్వేగేటు మూడు రోజుల పాటు మూసివేస్తున్నట్లు రైల్వే శాఖ సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఆర్ స్వామినాథన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఈ నెల 16వ తేదీ ఉదయం 8గంటల నుండి ఈ నెల 18వ తేదీ సాయంత్రం 6గంటల వరకు మూసివేస్తున్నట్లు తెలిపారు. రైల్వే ట్రాక్‌కు మరమ్మతులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వాహనదారులు ఈ విషయాన్ని గుర్తించి స్కూటర్లు, ఆటోలు, కార్లు పెట్లూరు సమీపంలో అండర్ బ్రిడ్జి దారిని వినియోగించుకోవాలన్నారు. బస్సులు, లారీలు, ట్రక్కులు నిడిగల్లు నుండి ఊట్లపల్లి దారిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయులను గౌరవించడం మన బాధ్యత

- గురుపూజోత్సవ వేడుకలో ఎమ్మెల్యే నాని
- 1500 మంది గురువులకు ఘన సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తునఎమ్మెల్యేలు, అధికారులు

ప్రజాశక్తి -రామచంద్రాపురం: ఉపాధ్యాయులను సన్మానించడం, గౌరవించడం మన బాధ్యతగా భావిస్తున్నానని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. శనివారం తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు సమీపంలోని శిల్పా రామంలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తిరుపతి జిల్లా జెసి శుభం బన్సల్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకట ముని ప్రసాద్ (నాని), తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ ప్రతి మనిషికి తల్లి, తండ్రి తర్వాత గురువులే మార్గదర్శకులని కొనియాడారు. గురువు ఎలాంటి స్వార్థం లేకుండా.. కులమత భేదాలు లేకుండా..నిస్వార్థంగా విద్యార్థులందరికీ ఒకే విధంగా విద్యను బోధిస్తారన్నారు. రాజకీయ నాయకుడు గెలిచిన తర్వాత పార్టీలకు అతీతంగా... కుల మతాలకతీతంగా.. నియోజకవర్గ అభివృద్ధి ముఖ్య లక్ష్యంగా పని చేయాలని అప్పుడే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. సమాజాభివృద్ధిలో గురువుల పాత్ర కీలకమన్నారు. దేశానికి విజ్ఞానవంతులైన భావి భారత పౌరులను అందించడంలో ఉపాధ్యాయుల గురుతర బాధ్యత వహిస్తారని పేర్కొన్నారు. పిల్లల బంగారు భవిష్యత్తులో ముఖ్య పాత్ర పోషిస్తారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా శాఖా మంత్రి లోకేష్ విద్యా వ్యవస్థను మెరుగు పరచడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. విద్యావ్యవస్థలో ఏదైనా సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకువస్తే దగ్గరుండి సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. తాము ఒక గురువు దగ్గర విద్య అభ్యసించిన వారమేనని పరిపాలనలో ఏ తప్పు జరిగినా తమకు సూచనలు ఇవ్వాలని ఉపాధ్యాయులను కోరారు. ఉపాధ్యాయులందరూ ఓట్లు వేసిన కారణంగానే గెలిచానని అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని సుమారు పదహైదు వందల మందికి పైగా ఉపాధ్యాయినిఉపాధ్యాయులను దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందించి అభినందించారు. ప్రతి ఒక్కరినీ స్వయంగా ఎమ్మెల్యే సన్మానించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు , జిల్లా జేసీ శుభం బన్సల్‌లను నాని దుశ్శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ వి శేఖర్, డిప్యూటీ డిఇఓ బాలాజీ, ఎంఈఓలు, ఉపాధ్యాయినిఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల కడుపుకొట్టే చట్టాలు మానుకోవాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేష్


సిఐటియు మండల కన్వీనర్‌గా ఎన్నికైన విజయ్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మోడీ ప్రభుత్వం కార్మికుల కడుపుగొట్టే చట్టాన్ని తీసుకొచ్చిందని, వీటిని వెంటనే మానుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం పుత్తూరు మండల కమిటీ విస్తృత స్థాయి, సిఐటియు కార్యాలయంలో సమావేశం ఎల్ఐసి లక్ష్మణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులు సిఐటియు జిల్లా కోశాధి కారి ప్రసాదరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేష్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారానికి వచ్చి కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికులకు కడుపు కొట్టే చట్టాలు తీసుకొస్తున్నారని ఆరోపించారు. ఎల్ఐసిని ప్రైవేట్ పరం ఆపాలని, బిల్డింగ్ వర్కర్లకు సంక్షేమ బోర్డు నుంచి నిధులు కేటాయించాలని, ఆటో వర్కర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు పుత్తూరు సమన్వయ కమిటీ కన్వీనర్‌గా ఏ విజయ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కో కన్వీనర్ గా లలితను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా ఎల్ఐసి నుంచి లక్ష్మణ్ కుమార్, దస్తగిరి, పి భాస్కర్, ఆటో యూనియన్ నుంచి పురుషోత్తం, యాసిన్ బాష, శివ, అంగన్‌వాడీ యూనియన్ నుంచి మునికుమారి, విజయ కుమారి, రాధా, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నుండి నరసింహులు, గోవింద్ రెడ్డి, సంఘమిత్ర నుంచి అరుణ, లారీ డ్రైవర్స్ నుంచి కృష్ణయ్య, ప్రశాంత్ మండల కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

రాజీతో కేసులు సత్వర పరిష్కారం: జడ్జి


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాజీతో సత్వరమే కేసులు పరిష్కరించు కోవచ్చని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర పేర్కొన్నారు. పుత్తూరు కోర్టు ఆవర ణలో జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కక్షి దారులు కేసులను సులభంగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, ధనం వృథా చేసుకోకుండా కేసులకు పరిష్కారం లభించి కుటుంబంలో ప్రశాంతత ఉంటుందని అన్నారు. జూనియర్ సివిల్ జడ్జి జానకి మాట్లాడుతూ భార్యాభర్తలు చిన్న చిన్న గొడవలు వేసుకుని కోర్టు చుట్టూ తిరగకుండా ఐకమత్యంగా ఉండి కేసులు లేకుండా ఉండాలని, లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తే శాశ్వత పరిష్కారం లభించినట్లేనని తెలిపారు. ఒకరికొకరు తగ్గితే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె పురుషోత్తం, న్యాయవాది సంజీవి, న్యాయవాదులు, కక్షి దారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గూడూరు జడ్జి పర్వీన్ సుల్తానామేగ

గూడూరు టౌన్ : న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులను పరిష్కరించేందుకు లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని ఏడవ అదనపు జిల్లా జడ్జి పర్వీన్ సుల్తానా బేగం పేర్కొన్నారు. గూడూరు రెండో పట్టణ పరిధిలో ఉన్న కోర్టు భవనాల సముదాయం ప్రాంగణంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చట్ట ప్రకారం రాజీ అయ్యే సివిల్, క్రిమినల్ కేసులను న్యాయమూర్తు లు పరిష్కరించారు. ఈ సంద ర్భంగా ఏర్పాటు చేసిన సమావేశం లోఏడవ అదనపు జిల్లా జడ్జి మాట్లాడుతూ ప్రతి రెండు నెలలకు ఒకసారి దేశ వ్యాప్తంగా ఒకేసారి మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని తెలిపారు. కక్షిదారులు లోక్ అదాలత్‌లో కేసులు పరిష్క రించు కోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం లో న్యాయ మూర్తు లు, లోక్ అదాలత్ సభ్యులు, న్యాయ వాదులు, పోలీస్ శాఖ అధికారు లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


జిల్లా జడ్జి శ్రీనివాస్ నాయక్

శ్రీకాళహస్తి : జాతీయ లోక్ అదాలత్ లో ఇచ్చే తీర్పు.. సుప్రీంకోర్టు తీర్పుతో సమానమనీ, దానికి తిరిగి అప్పీలు చేసుకునే అవకాశమే ఉండదని 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్ నాయక్ అన్నారు. స్థానిక శ్రీకాళహస్తి కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా కక్షిదారులను ఉద్దేశించి న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పరిష్కారం కాని అనేక కేసులను సత్వరం పరిష్కరించుకోడానికి లోక్ అదాలత్ ఒక చక్కటి మార్గమని సూచించారు. రాజీపడని క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మోటార్ ప్రమాద పరిహార కేసులు, లేబర్ కేసులు, సివిల్ కేసులు, కోర్టు వరకు వెళ్లని రాజీ పడదగిన తగాదాలను లోక్ అదాలత్ ద్వారా అక్కడికక్కడే పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఫలితంగా కక్షిదారులకు డబ్బు, సమయం ఆదా అవుతుందని చెప్పారు. సత్వర న్యాయం పొందేలా కక్షిదారులను చైతన్య పరచి విరివిగా లోక్ అదాలత్‌లో పాలు పంచుకునేలా సంబంధిత శాఖల అధికారులు చొరవ చూపాలని సూచించారు. అనంతరం రాజీ పడని పలు కేసులకు అక్కడకక్కడే పరిష్కారం చూపారు. సీనియర్ సివిల్ జడ్జ్ బేబీ రాణి, జూనియర్ సివిల్ జడ్జ్ క్రిష్ణప్రియ పాల్గొన్నారు.

సమాజంలో వైద్యుల పాత్ర కీలకం

ఎస్‌వి వైద్య కళాశాల కాలేజ్ డే కలెక్టర్



ప్రజాశక్తి -తిరుపతి సిటీ: సమాజంలో వైద్యుల పాత్ర ఎంతో కీలకమని, అటువంటి వైద్య విద్యను అభ్యసిస్తున్న వైద్య విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ వహించి ఉన్నత విద్యను అభ్యసించాలని డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం ఎస్‌వి వైద్య కళాశాల భువన విజయం ఆడిటోరియంలో ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ ఆధ్వర్యంలో కాలేజ్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్వీ వైద్య కళాశాల విచ్చేసిన సందర్భంగా తనకు ఎంబిబిఎస్ చదువుకున్న రోజులు గుర్తుకొస్తున్నాయన్నారు. వైద్య విద్య ఎంతో విలువైందని ప్రతి విద్యార్థి చిత్తశుద్ధితో విద్యను అభ్యసించి మంచి వైద్యులుగా బయటికి వెళ్లాలని కోరుకుంటున్నానన్నారు. ప్రతి వైద్యుడు పేద రోగులకు వైద్యం అందించాలని, గ్రామీణ ప్రాంతంలో కొంతకాలం పనిచేసే అనుభవం తెచ్చుకొని పీజీ వైద్య విద్యలో చేరితే ఇంకా మంచి వైద్యం అందించవచ్చని తెలిపారు. ప్రతి విద్యార్థి వైద్య విద్య అనంతరం పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. రాష్ట్రంలోనే ఎస్వీ వైద్య కళాశాల పరిశోధనలో ముందడుగు వేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రధాని చెప్పినట్లు వైద్య రంగంలో మార్పులు రాబోతున్నాయని, ప్రపంచ దేశాలు అన్నీ భారతదేశం వైపు చూస్తున్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు, ప్రసూతి ఆసుపత్రి డాక్టర్ పార్థసారధిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ సునీత పాల్గొన్నారు.

'కేశవరెడ్డి'లో చిత్తూరు జోన్ క్రీడా సంబరాలు

ప్రజాశక్తి - రేణిగుంట: మామండూరులోని కేశవరెడ్డి ఈఎం స్కూలులో చిత్తూరు జోన్ క్రీడా పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడలు ఈనెల 14–16 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లాలకు సంబంధించి దాదాపు 800 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. కబడ్డీ, కోకో, వాలీబాల్, త్రోబాల్ వంటి జట్టు పోటీలు రన్నింగ్ రేస్, జావలిన్ త్రో, డిస్కస్ త్రో, లాంగ్ జంప్ ,హై జంప్ మొదలగు వ్యక్తిగత పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 16వ తేదీన బహుమతులు ఇవ్వనున్నారు. కేశవరెడ్డి విద్యాసంస్థల ఫౌండర్ ఛైర్మన్ కేశవరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపి, సమాజంలో ఉత్తమ పౌరునిగా తీర్చి దిద్దా లని, గెలవా లనే తపన, గెలుస్తామనే నమ్మకం, గెలిచి తీరాలనే ధృడ సంక ల్పం విద్యార్థుల్లో కలి గించాలనే ఈ పోటీలు నిర్వహి స్తున్న ట్లు తెలిపారు. రాష్ట్ర సాంస్కృతిక విభాగ ప్రముఖులు సుధా రాజ్యం , నరసింహారెడ్డి పాల్గొన్నారు.

పుస్తక పఠనం పెంపొందించుకోవాలి : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థులు పుస్తక పఠనం పెంపొందించుకోవాలని, సమాజంలో జరిగే అంశాలపై అవగాహన కోసం పత్రికలను చదవాలని, గ్రంథాలయం వెళ్లి పుస్తకాలను చదివి ఆసక్తిని పెంపొందించుకోవాలని పశ్చిమ రాయలసీమ టీచర్స్ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అన్నారు. రేవల్యూషనరి విద్యార్థి సంఘ ప్రథమ జాతీయ మహాసభలు ఎస్వీయూలో సేనెట్ హాల్లో శనివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రవిశంకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యు నాయకులు భీమరాజు, సురేష్, ఆకుమూల శ్రీధర్, ప్రశాంత్, కృష్ణారెడ్డి, నవీన్ కుమార్, చిరంజీవి, హరి, విజయ, హారతి, మహాలక్ష్మి, రోజా, అఫ్జాన్, మహబూబ్ బాషా, పాల్గొన్నారు.

శ్రీరామ కళాశాలలో ఇంజనీర్స్‌డే వేడుకలు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి–కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో సెప్టెంబర్ 15 ఇంజనీర్స్ డే వేడుకలు సివిల్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ముందుగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. జయచంద్ర మాట్లాడుతూ కళాశాల విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి, డైరెక్టర్స్ మన్నెం రామ సుబ్బా రెడ్డి, మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి , సివిల్ డిపార్ట్మెంట్ విభాగాధిపతి బి బాలకృష్ణ భారత్, నిర్వాహకులు పి సుజన, ఎస్ మోనిక సౌజన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

సినిమా థియేటర్లో యువకుడిపై కత్తితో దాడి

ప్రేమ వ్యవహారమే కారణం


కత్తి దాడిలో గాయపడ్డ లోకేష్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : ప్రేమ వ్యవహారమై కక్ష పెంచుకుని సినిమా థియేటర్లో ఓ యువకుడిపై కత్తితో దాడికి పాల్పడ్డ సంఘటన శనివారం తిరుపతిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన లోకేష్ తిరుపతికి సమీపంలోని మోహన బాబు యూనివర్సిటీలో పారామెడికల్ కోర్స్ చేస్తున్నాడు. అతనితోపాటు పారామెడికల్ కోర్స్ చేస్తున్న సూళ్లూరు పేటకు చెందిన కావ్యను ప్రేమించాడు. ఇద్దరూ కలిసి శనివారం తిరుపతిలోని పీజీఆర్ థియేటర్లో సినిమాకి వచ్చి, వీక్షిస్తున్నారు. సూళ్లూరుపేటకు చెందిన కావ్య సమీప బంధువు కార్తీక్ అక్కడికి లోకేష్‌ను వెనుక నుంచి కత్తితో పొడిచి, కావ్యాన్ని తీసుకొని పారిపోయాడు. గాయాలు పాలైన లోకేష్‌ను ప్రేక్షకులు 108 సాయంతో రుయాకు తరలించారు. విషయం తెలుసుకున్న ఈస్ట్ పోలీసులు ఆస్పత్రికి చేరుకొని, లోకేష్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి కోసం మూడు బృందాలతో గాలింపు చర్యలు చేపడుతున్నామని ఈస్ట్ పోలీసులు పేర్కొన్నారు.

భారీగా గంజాయి స్వాధీనం

పోలీసుల అదుపులో నిందితులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండల పరిధిలో శనివారం అర్ధరాత్రి భారీగా గంజాయి పట్టుబడింది. స్కార్పియో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి గంజాయిని తరలిస్తున్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని స్టేషన్ కు తరలించి విచారిస్తున్నారు. వాహనంలో భారీగా గంజాయి లభించడంతో దీని వెనుక ఉన్న డ్రగ్ ముఠా వివరాలను తెలుసుకునేందుకు మరింత క్షుణ్ణంగా విచారణ చేపట్టనున్నారు. ఆ కారణంవల్లే మీడియాకు వివరాలు వెల్లడించలేదని సమాచారం. ఇటీవల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్ వ్యాప్తి గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో డ్రగ్స్ రాకెట్టు గుట్టును రట్టు చేసేందుకు రాష్ట్ర పోలీసు శాఖ ముమ్మరంగా తనిఖీలు, సోదాలు చేపడుతోంది. ఈ క్రమంలో పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి వేదికగా భారీ స్థాయిలో గంజాయి పట్టుబడటం సంచలనంగా మారింది.

కారు బోల్తా

డ్రైవర్‌కు తప్పిన ముప్పు

ప్రజాశక్తి -కోట : కల్వర్టులో కారు బోల్తాపడిన సంఘటనలో డ్రైవరు చాకచక్యంగా ప్రమాదం నుండి తప్పించుకుని బయట పడడంతో ముప్పు తప్పింది. స్థానికుల కథనం మేరకు...కోట మండలం విద్యానగర్ నుండి కొత్తపాలెం గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న చిన్న కల్వర్టు వద్ద మలుపు ఉందని తెలియక ప్రమాదవశాత్తు కారు బోల్తా పడింది. అయితే శనివారం ఉదయం విద్యానగర్ నుండి పలువురు వాకింగ్‌కు వెళ్లే వారు కాలువులో బోల్తా పడిన కారును పరిశీలించారు. బోల్తా పడిన కారు రాజస్థాన్ రిజిస్ట్రేషన్ తో నెంబర్ వుంది. కారు డ్రైవర్ అత్యంత చాకచక్యంగా ఎలాంటి ప్రమాదం లేకుండా తప్పించుకు బయట పడినట్లు స్థానికులు పేర్కొన్నారు.

ఆదిశంకరలో 'కోడ్ క్రాఫ్టార్స్ క్లబ్' ప్రారంభం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణం లోని ఆదిశంకర ఇంజ నీరింగ్ కళాశాలలో విద్యార్థు ల లో ఉపాధి, నైపుణ్యా లను పెంపొందిం చేందు కు కోడ్ క్రాఫ్టార్స్ క్లబ్‌ను శనివారం ప్రారంభిం చా రు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వేణు మాధవ్ మాట్లాడుతూ ఈ క్లబ్ వల్ల విద్యార్థులలో కోడింగ్ నైపుణ్యాలను పెంపొందించి వారి ఉన్నత భవిష్యత్‌కు బాటలు వేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది రాజయ్య, ఇమ్మానుయేల్ , పద్మావతి, ఏవో రాజయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు అర్థరహితం: టిడిపి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేయడం అర్ధరహితమని టిడిపి సీనియర్ నాయకులు కాటూరు రామనాథం పేర్కొన్నారు. మండలంలోని శ్రీ పచ్చలమ్మ పరమేశ్వరి ఆలయంలో మండలంలోని కాటూరు పంచాయతీకి చెందిన టిడిపి నాయకులు రామనాథం ఆధ్వర్యంలో పచ్చలమ్మ పరమేశ్వరుని ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామనాథం మాట్లాడుతూ ఎమ్మెల్యే అభివృద్ధి చెందడాన్ని ఓర్వలేకే కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఆయనపై ఆరోపణలు తొలగి మళ్లీ సత్యవేడు బాధ్యతలు స్వీరించేలా చేయాలని ఆలయంలో పూజలు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

బాలకృష్ణయ్యకు ఎమ్మెల్యే నివాళులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వడమాల పేట మండలం పాదిరేడు గ్రామానికి చెందిన సర్దార్ బాలకృష్ణయ్య మృతదేహానికి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ శనివారం ఘన నివాళులర్పించారు. ఫారెస్ట్ శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన తరువాత చిత్తూరు జిల్లా టిఎన్‌టియుసి సెక్రటరీగా బాలకృష్ణయ్య పని చేశారు. ఇతను వడమాలపేట టౌన్‌కి వెళ్లి తిరిగి మోటార్ సైకిల్‌పై నేషనల్ బైపాస్ రోడ్డు దాటుతుండగా అతి వేగంగా వచ్చిన ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాదిరేడు గ్రామానికి చేరుకొని బాలకృష్ణయ్య మృత దేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటరీ జిల్లా టిఎన్‌టియుసి అధ్యక్షులు రావిళ్ల మాధవ నాయుడు, వడమాల పేట టిడిపి నాయకులు పాల్గొన్నారు.

శివయ్య సేవలో హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : రాష్ట్ర హైకోర్టు జడ్జి టి మల్లికార్జునరావు శనివారం కుటుంబ సమేతంగా శనివారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. ఆయనకు ఆలయ అధికారులు సంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.